




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 10 సెప్టెంబర్ 2025 పేజీలు 8


# వామ్మో బెంజీసర్కిల్ ఎగ్జిబిషనా?

బెంజిసర్కిల్ ఎగ్జిబిషన్ పై అధికారుల మౌనం వెనుక రాజకీయ ఒత్తిళ్ళు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే ఒత్తిళ్లతో ఎగ్జిబిషన్‌ను అనధికారికంగా నిర్వహిస్తున్న అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడువు ముగిసి తొమ్మిది రోజులైన ఇప్పటిదాకా అన్ని శాఖల అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

(విజయవాడ కార్పొరేషన్, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్)

- మాకేం కనబడడం లేదు బాబోయ్
- అధికారుల మౌనం వెనుక ఎంపీ, ఎమ్మెల్యే
- కమిషనర్ సారూ.. జరదేకో..

వివరాలు 2లో...



## చెరువులు..

### పల్లె ప్రగతికి ఆధారాలు..

- ట్రిపుల్ ఆర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం
- జల వనరులు నీటి సామర్థ్యం పెంపుపై దృష్టిపెట్టాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2

### దివ్యాంగులు, వృద్ధులకు

# ఇంటి వద్దనే రేషన్ అందిస్తున్నాం



**ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పారదర్శంగా నిత్యావసర సరుకుల పంపిణీ**

**జాయింట్ కలెక్టర్ ఇలక్కియా**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పారదర్శంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని, దివ్యాంగులు 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ విధానన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ ఇలక్కియా గొల్లపూడిలోని 50 నెంబర్ రేషన్ దుకాణాన్ని పరిశీలించి దివ్యాంగురాలైన జనమల లక్ష్మీకీర్తి, ఆనరోగ్యంతో బాదపడుతున్న కనవర్తి బుజ్జి, వృద్ధురాలైన డి. ఉషారాణిలకు ఇంటివద్ద నిత్యావసర సరుకులను అందజేశారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 957 రేషన్ షాపుల ద్వారా 5 లక్షల 90,243 కార్డుదారులకు 8వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన 57,వేల 690 మంది కార్డుదారులను గుర్తించామని వారికి రేషన్ డీలర్లు ద్వారా ఇంటి వద్దనే నిత్యావసర సరుకులను అందజేసే ఏర్పాటు చేశామన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా 1 నుంచి 15వ తేదీలోగా సరుకులు సరఫరా చేయాలని డీలర్లకు ఆదేశించామన్నారు. ఉదయం 8 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచివుంచి కార్డు దారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డీలిర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి దానిపై క్యూ.ఆర్.కోడ్ ఏర్పాటు చేస్తున్నామని,

మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)




## వామ్మో బెంజిసర్కిల్ ఎగ్జిబిషనా?

**విజయవాడ కార్పొరేషన్, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** బెంజిసర్కిల్ ఎగ్జిబిషన్‌పై నేటి దినపత్రిక సూర్య వరుస కథనాలతో అధికారులలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఎగ్జిబిషన్ వద్దకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నా ఎంపీ, ఎమ్మెల్యే నుంచి ఫోన్లు రావడంతో అధికారులు వెనకడుగు వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆగస్టు నెలాఖరుకే ఎగ్జిబిషన్ గడువు ముగిసినా ఇప్పటిదాకా అధికారులు ఎగ్జిబిషన్ వైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు నిత్యం ఎగ్జిబిషన్ వలన ట్రాఫిక్ చుక్కలు కనబడుతున్నాయని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా ఎగ్జిబిషన్ నిర్వాహకులకు సపోర్ట్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బెంజిసర్కిల్ వద్ద నిత్యం కేసులు రాసే పోలీసులు ఎగ్జిబిషన్ వద్ద ట్రాఫిక్ జామ్ అవుతున్నా వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టినా చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చూడాలి అధికారులు ఇప్పటికైనా ఎగ్జిబిషన్‌పై దృష్టిసారిస్తారో లేదోనని...

## దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందిస్తున్నాం



మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చని అన్నారు. పంపిణీ చేసిన రేషన్ బియ్యం నాణ్యతను కార్డుదారుల నుండి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన ఫోర్టీ ఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, రేషన్ షాప్ డీలర్లు అవకతవకులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. రేషన్ షాపు పరిశీలనలో డిఎస్ఓ ఏ.పాపారావు ఏఎస్ఓ చల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పి.దేవప్రియుడు, కె.రమేష్, రేషన్ దుకాణాల డీలర్ విజయ్, పౌరసరఫరాల సిబ్బంది ఉన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రోగులు ఎటువంటి ఇబ్బంది పడకుండా మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ వైద్యాధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్లో మంగళవారం జిల్లా కలెక్టర్ డా జి లక్ష్మీశ వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం జిల్లాలోని అన్ని చోట్ల ఉదయం 6 గంటలకే ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ అనుమానితుల నుండి శాంపిల్స్ తీసి రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. త్రాగునీటి శాంపిల్స్ ఎప్పటికప్పుడు పరీక్షించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జనన మరణ నివేదికలు అదేవిధంగా ప్రసవాల నివేదిక ముఖ్యంగా నార్మల్, సిజేరియన్ నమోదు వివరాలు ప్రతిరోజు అందజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని అత్యవసర మందుల నిల్వలు అందుబాటులో ఉండాలని, మందుల కొరత సమస్య ఉండరాదన్నారు. ప్రతి మంగళవారం ఆరోగ్య సమీక్ష ఉంటుందని అన్నారు. ఏఎన్ఎం నుండి మెడికల్ ఆఫీసర్ వరకు అన్ని స్థాయిల్లోనూ అప్రమత్తత అవసరమని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. మాచర్ల సుహాసిని, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ జె ఇందుమతి. డా. ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా. జె. సుమన్, డిఐఓ డా. శరత్ కుమార్, డిసిహెచ్ఎస్ డా. మాధవి దేవి ఉన్నారు.

# చెరువులు.. పల్లె ప్రగతికి ఆధారాలు..

**ట్రిపుల్ ఆర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం**

**జల వనరులు నీటి సామర్థ్యం పెంపుపై దృష్టిపెట్టాలి**

**8 చెరువులకు రూ. 14.19 కోట్లతో పనులకు ప్రతిపాదనలు**

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్‌టీఆర్ జిల్లా, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** చెరువులు పల్లెల ప్రగతికి ఆధారాలని.. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, భూగర్భ జలాల వృద్ధి, పర్యావరణ ప్రయోజనాలు, వ్యవసాయ ఉత్పాదకత – అన్నదాతల ఆదాయాల పెంపు వంటి బహుళ ప్రయోజనాలకు చెరువులు చిరునామా అని, ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నీటి వనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్‌ఆర్‌ఆర్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నీటి వనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్‌ఆర్‌ఆర్) పథకానికి సంబంధించి జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగు, తాగు నీటి అవసరాలను తీర్చే చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా, భూగర్భ జలాల రీఛార్జ్ జరిగేలా ప్రత్యేక పనులు చేపట్టాల్సిన అవసరముందన్నారు. నీటి వనరుల సుస్థిర నిర్వహణకు సామాజిక భాగస్వామ్యంతో పాటు స్వయం సమృద్ధి వ్యవస్థల మద్దతు అవసరమన్నారు. ట్రిపుల్ ఆర్ పథకం కింద తాజాగా మైలవరం, విజయవాడ రూరల్, రెడ్డిగూడెం మండలాల పరిధిలోని ఎనిమిది చెరువుల అభివృద్ధికి సంబంధించి రూ. 14.19 కోట్లతో పనులను ప్రతిపాదించడం జరిగిందని.. తాజా సమావేశంలో నిపుణులు సూచించిన అంశాల మేరకు ట్రిపుల్ ఆర్ పథకం లక్ష్యాలు నెరవేరేలా డీపీఆర్‌లు ఉండేలా చూడాలన్నారు. చెరువు కట్టల పటిష్టీకరణ, సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటుతో పర్యాటకంగా కూడా అభివృద్ధికి వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈ ఆర్.మోహన్‌రావు, కమిటీ కన్వీనర్ పి.గంగయ్య, కేంద్ర జల సంఘం నుంచి నామినేట్ అయిన డీడీ కె.శంకర్, సైంటిఫిక్ ఆఫీసర్ టి.వెంకటగిరి, డ్వామా పీడీ ఎ.రాము, గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ ఎస్.విద్యాసాగర్, గ్రౌండ్ వాటర్ డీడీ ఎం.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం -రేపల్లె రైల్వే లైను త్వరలో సాకారం




**మచిలీపట్నం ఎంపి బాలశౌరి**



**మచిలీపట్నం, మేజర్ న్యూస్:** మంగళవారం ఢిల్లీలో లోక్ సభ సబార్డినేట్ లేజిస్లేషన్ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ తో, ఇతర రైల్వే ఉన్నతాధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే మంత్రిత్వ శాఖ విధి విధానాల గురించి చర్చించిన లోక్ సభ సబార్డినేట్ లేజిస్లేషన్ చైర్మన్ బాలశౌరి, మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని పలురైల్వే అంశాలను రైల్వే బోర్డ్ చైర్మన్ దృష్టికి తేవడం జరిగింది.

**మచిలీపట్నం -రేపల్లె రైల్వే లైను :**

కృష్ణా జిల్లా ప్రజలచిరకాల వాంఛ అయిన మచిలీపట్నం రేపల్లె రైల్వే నూతన లైను గురించి రైల్వే బోర్డు చైర్మన్ తో చర్చించడం జరిగింది. ఈ నూతన రైలు మార్గం కోసం గతంలో అనేక ఉద్యమాలు, ఆందోళనలు జరిగాయని, ఈ మార్గం వలన కోల్ కతా నుండి చెన్నై వెళ్ళే రైళ్ళువిజయవాడ జంక్షన్ మీదుగా వెళ్ళకుండా, మచిలీపట్నం మీదుగా వెళ్ళడానికి అవకాశం కలుగుతుందని, ఈ మార్గం గుండా రైళ్ళు ప్రయాణిస్తే 70 కిలో మీటర్ల మేరకు దుర్గం తగ్గడంతో బాటు, విజయవాడ జంక్షన్ పైన రైళ్ళ ట్రాఫిక్ భారం కూడా కొంతమేరకు తగ్గుతుందని, ప్రయాణ సమయం కలిసి రావడంతో బాటు సరుకు రవాణా ఖర్చులు కుడా గణనీయంగా తగ్గుతాయని తెలపడం జరిగింది, త్వరలో పూర్తి కానున్న మచిలీపట్నం పోర్టు నుండి కుడా సరుకుల రవాణాను తక్కువ ఖర్చుతో చేయవచ్చని చైర్మన్ కు ఎంపి వివరించారు. తీరప్రాంతంలో అత్యంత ముఖ్యమైన కోస్టల్ లైనుగా ఇది భవిష్యత్తులో ఉపయోగపడుతుందని, ప్రధానంగా మచిలీపట్నం పోర్టుకు సరుకు రవాణాలో కీలక మార్గం కాబోతుందని వివరించడం జరిగింది. ప్రతిపాదిత కోస్టల్ రైల్వే కారిడార్ లో ( నరసాపూర్ -మచిలీపట్నం -రేపల్లె -నిజాంపట్నం - బాపట్లలను కలుపుతూ ) ఇది ముఖ్యమైన పాత్ర వహిస్తుందని, అందువలన సదరు మచిలీపట్నం రేపల్లె రైలు మార్గం యొక్క డి.పి.ఆర్ తయారిని వెంటనే పూర్తిచేసి పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయవలసినదిగా ఎంపి కోరారు.

**వివిధ ఆర్ వో బిలు, ఆర్ యు బిల నిర్మాణం**

కృష్ణా జిల్లా ప్రజల నుండి వస్తున్న అనేక విజ్ఞప్తుల మేరకు,, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి గాను, రామవరప్పాడు, గూడవల్లి, తెన్నేరు, పెడన, మచిలీపట్నం లో పెడన, మెడికల్ కళాశాల, బందరు పోర్ట్, గుడివాడ గేట్ల వద్ద నూతనంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం కొరకు ప్రతిపాదనలు రైల్వే బోర్డు చైర్మన్ కు ఎంపి బాలశౌరి అందచేశారు. ఇవన్నికూడా కృష్ణా జిల్లాలో ట్రాఫిక్ సమస్యలకు తగ్గించడానికి సరైన పరిష్కారంగా నిలుస్తాయని వివరించారు.

**బందరు నుండి తిరుపతికి ప్రతి రోజు రైలు**

కృష్ణా జిల్లా ప్రజలు ఎప్పటినుండో మచిలీపట్నం నుండి తిరుపతికి ప్రతిరోజు రైలు ఏర్పాటు చేయాలనీ కోరుతున్నారు. దీనిగురించి చైర్మన్ తో మాట్లాడుతూ గతంలో నర్సాపురం నుండి కొన్ని బోగీలు, మచిలీపట్నం నుండి కొన్ని బోగీలు గుడివాడలో కలిపి తిరుపతికి వెళ్ళేవారని, అందువలన తిరుపతి వెళ్ళే ప్రయాణికులకు ముఖ్యంగా వృద్ధులకు, మహిళలకు అసౌకర్యంగా ఉంటుంది అని, లగేజిని తీసుకు వెళ్ళడం, ప్లాట్ ఫారం లు మారడం ఇబ్బందికరంగా ఉందని వచ్చిన ఆరోపణల నేపధ్యంలో మచిలీపట్నం నుండి తిరుపతికి ప్రతిరోజూ తిరిగేలాగున ఒక రైలు ఏర్పాటు చేయాలని చైర్మన్ ను కోరడం జరిగింది. కృష్ణా జిల్లా కేంద్రం అయిన మచిలీపట్నం నుండి ప్రతిరోజూ పెద్ద ఎత్తున తిరుపతికి వెళ్లి, వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవాలనే భక్తులకు ఈ రైలు సౌకర్యంగా ఉంటుందని తెలపడం జరిగింది.

పై విషయాలను పరిశీలించి సానుకూలంగా త్వరలోనే తగినచర్యలు చేపట్టడం జరుగుతుందని రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ లోక్ సభ సబార్డినేట్ లేజిస్లేషన్ చైర్మన్, ఎంపి బాలశౌరికి తెలియచేశారు. ఈ సమావేశంలో చైర్మన్ సతీష్ కుమార్, రైల్వే బోర్డు మెంబర్లు నవీన్ గులాటి, హితేంద్ర మల్హోత్రా, బ్రజ్ మోహన్ అగర్వాల్, డైరెక్టర్ జనరల్ హ్యూమన్ రిసోర్సు రాజగోపాల్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డిజి మిస్ సోనాలి మిశ్రా, అడిషనల్ మెంబర్ రాజేష్ కుమార్ కశ్యప్, రైల్వే బోర్డు సెక్రటరీ శ్రీమతి అరుణ్ నాయర్, ఐఆర్ఎఫ్‌సిఎల్ సిఎండి మనోజ్ కుమర్ దూబే, రైల్వే టూరిజం అండ్ కేటరింగ్ కార్పొరేషన్ సిఎండి సంజయ్ కుమార్ జైన్, సిసిఐ సిఎండి సంజయ్ స్వరూప్, ఇండియన్ రైల్వే కన్స్ట్రక్షన్ కంపెనీ సిఎండి హరి మోహన్ గుప్తా, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ డైరెక్టర్ అనురాగ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏషియన్ పెయింట్స్ రాయల్ గ్లిట్జ్‌లో దీపికా పదుకోణె

## ఇంటికి సరికొత్త అందాన్ని తెస్తున్న రాయల్ గ్లిట్జ్, దీపిక



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇంటికి అందాన్ని ఇచ్చేది రంగులు మాత్రమే. ఆ రంగులు కూడా అనేకం ఉంటాయి. అందులో మనకు నచ్చే ఒకట్రెండు రంగులతో ఇంటిని ఎంతో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఏ రంగు పడితే ఆ రంగు కాకుండా నాణ్యమైన రంగులను ఎంపిక చేసుకోవాలి. నాణ్యతకు మారుపేరు ఏషియన్ పెయింట్స్. ఇప్పుడు ఏషియన్ పెయింట్స్ తన లగ్జరీ బ్రాండ్ 'రాయల్ గ్లిట్జ్'ను ప్రీమియం వాల్ ఫినిష్ నుంచి హోమ్ డెకర్ ఇన్స్పిరేషన్‌గా అభివృద్ధి చేస్తోంది. ఈ ప్రకటనలో బ్రాండ్ అంబాసిడర్ దీపికా పదుకోణె ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రంలో ఆమె రాయల్ గ్లిట్జ్ రంగులు, టెక్చర్లతో మమేకమవుతుండగా గోడలు వ్యక్తిగత శైలికి ప్రతిబింబాలుగా మారుతాయి. 'రాయల్ గ్లిట్జ్'తో ఇంటికి కొత్త రూపం వస్తోంది. ఈ క్యాంపెయిన్లో గోడల ఫినిష్ ఇంటీరియర్ డిజైన్ ఎంపికను ఎలా ప్రభావితం చేస్తాయో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ చిత్రంలో ముఖ్యాంశం 'గ్లిట్జ్ అప్ యువర్ డెకోర్' గైడ్‌బుక్. ఈ బుక్ సులభంగా తమ ఇళ్లను కొత్త శైలిలో అలంకరించుకోవడానికి అవసరమైన సృజనాత్మక ఆలోచనలకు ప్రేరణ ఇస్తుంది. ప్రతి గది, ప్రతి గోడ వాల్ డిజైన్ ఆ ప్రదేశాన్ని ఎలా మార్చేస్తుందో ఈ చిత్రంలో చూడవచ్చు. ఈ గైడ్‌బుక్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌లు డెమో వీడియోలకు, ప్రేరణాత్మక ఆలోచనలకు లింక్ అవుతూ.. ప్రీమియం డిజైన్‌ను అందుబాటులోకి తెస్తుంది. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ సింగిల్ మాట్లాడుతూ రాయల్ గ్లిట్జ్‌తో భారతీయ ఇళ్లలో లగ్జరీకి కొత్త నిర్వచనం ఇస్తున్నామన్నారు. స్వీయ వ్యక్తీకరణ శక్తి మీద ఏషియన్ పెయింట్స్ కు విశ్వాసం ఉందన్నారు. ఇంటిని మనదిగా మార్చేది మన వ్యక్తిత్వం మాత్రమేనన్నారు. ఈ ప్రచారంలో ఒక గోడ మొత్తం గదిని ఎలా మార్చగలదో చూపిస్తుందన్నారు. 'డిజైన్' మన వ్యక్తిత్వం నుంచి మొదలవుతుందని ఇది చెప్తుందన్నారు. ఇల్లు స్థిరమైన నిర్మాణం కాదని, వ్యక్తిత్వానికి అనుగుణంగా మారుతూ ఉండే ప్రతిబింబమని పేర్కొన్నారు. దీపికాతో మా అనుబంధం కొనసాగుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. మృదువైన క్రీమ్ ఫినిష్, టెఫ్లాన్ సర్ఫేస్ ప్రొటెక్టర్, ప్రముఖ డిజైనర్లతో ప్రత్యేకంగా రూపొందించిన కలర్ రేంజ్‌తో రాయల్ గ్లిట్జ్ కేవలం అందం మాత్రమే కాకుండా అత్యుత్తమ పనితీరును కూడా అందిస్తుందన్నారు. ఇది లగ్జరీ పెయింట్‌పై ఉన్న అభిప్రాయాన్ని పూర్తిగా మారుస్తూ డెకర్, డిజైన్‌లో అత్యుత్తమంగా నిలుస్తోందని తెలిపారు. రంగులు, ఫినిష్‌లు, డెకోర్ విభాగాల్లో కస్టమర్ల ప్రయాణాన్ని విలువైనదిగా మార్చడమే ఏషియన్ పెయింట్స్ లక్ష్యమన్నారు. కాంట్రాక్టర్ రావడానికి ముందే వినియోగదారులతో నేరుగా కలవడానికి ఇది సహాయపడుతుందని తెలిపారు. రాయల్ గ్లిట్జ్‌ను కేవలం ఒక ఉత్పత్తిగా మాత్రమే కాకుండా అత్యున్నత స్థాయిలో నిలుపుతూ, ఏషియన్ పెయింట్స్ ఆవిష్కరణ, కథ చెప్పే శైలి రెండింటిలోనూ తన నాయకత్వాన్ని బలపరుస్తోందని తెలిపారు.

## సీనియర్ నేత నెల్లూరు వెంకటేశ్వరరావు మృతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం కందులపాడు గ్రామానికి చెందిన ప్రముఖులు, టీడీపీ నాయకులు నెల్లూరు శ్రీనివాసరావు కి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి నెల్లూరు వెంకటేశ్వరరావు (92) మంగళవారం తుదిశ్వాస విడిచారు. సీనియర్ కాంగ్రెస్ నేత అయిన నెల్లూరు వెంకటేశ్వరరావు 30 ఏళ్ల పాటు కందులపాడు సర్పంచిగా, 10 ఏళ్ల పాటు వెలగలేరు పి.ఏ.సి.ఎస్ (సొసైటీ) అధ్యక్షునిగా, వెలగలేరు జెడ్పి ఉన్నత పాఠశాల వ్యవస్థాపక కమిటి అధ్యక్షునిగా, ఆ తర్వాత అభివృద్ధి కమిటీ చైర్మన్ గా, కార్యదర్శిగా వివిధ హోదాల్లో సేవలందించారు. 1970 దశకంలోనే మారుమూల గ్రామీణ ప్రాంతమైన కందులపాడు క్రాస్ రోడ్డు వద్ద సినీ థియేటర్ను నిర్మించారు. మాజీమంత్రి చనమోలు వెంకట్రావు కి అత్యంత సన్నిహితంగా ఉంటూ ఆయన ఈ ప్రాంతంలో రైతుల అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన కోడలు, నెల్లూరు లీలా శ్రీనివాసరావు సతీమణి నెల్లూరు శ్రీదేవి కందులపాడు సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై సేవలందిస్తున్నారు. నెల్లూరు వెంకటేశ్వర రావు మృతితో కందులపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. నేటి మధ్యాహ్నం నుంచి కందులపాడులో నెల్లూరు వెంకటేశ్వరరావు అంతిమయాత్ర, అంత్యక్రియ లు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆయన మృతి పట్ల మంగళవారం ఓ ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేశారు. ఆయన పవిత్రాత్మ కు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు.



## నరేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే, కూటమి నాయకులు

**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ కుటుంబానికి చెందిన స్వీట్ షాప్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదంలో ఆహుతి కాగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. అగ్నికి ఆహుతైన దుకాణాన్ని కుమార్ రాజా పరిశీలించి నరేష్‌ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, అలాగే నష్టం వివరాలను నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామ లింగేశ్వర రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండపాక శంకరబాబు తదితరులతో పాటు కూటమినాయకులు, కార్యకర్తలునరేష్‌ను పరామర్శించారు.

# రూ. 20,000 కోట్ల ఏయూఎం దాటిన ఫండ్స్ ఇండియా

## భారతదేశపు గో-టు వెల్త్ మేనేజ్మెంట్ ప్లాట్ఫార్మ్ కావాలని లక్ష్యంగా చేసుకుంది

**విజయవాడ, సెప్టెంబరు 9, మేజర్ న్యూస్ :** భారతదేశములో అగ్రగామిగా ఉన్న డిజిటల్ వెల్త్ మేనేజ్మెంట్ ప్లాట్ఫార్మ్స్ లో ఒకటైన ఫండ్స్ ఇండియా, అసెట్స్ అండర్ మేనేజ్మెంట్ (ఏయుఎం) లో రూ. 20,000 కోట్లు దాటి ఒక మైలురాయిని సాధించినట్లు ప్రకటించింది. ఈ మైలురాయి పెట్టుబడిదారు-కేంద్రిక పరిష్కారాలను అందించడములో విశ్వసనీయమైన ఫిన్ టెక్ నేతగా కంపెనీ యొక్క ధృఢమైన మార్కెట్ స్థానాన్ని సూచిస్తుంది. ఫండ్స్ ఇండియా యొక్క అభివృద్ధి పథము రీటెయిల్ పెట్టుబడిదారు, భాగస్వామి ఎకోవ్యవస్థ, ప్రైవేట్ వెల్త్ క్లయింట్స్ లో నిలకడగా ఉండే విస్తరణను, తద్వారా వెల్త్ మేనేజ్మెంట్ రంగములో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడాన్ని ప్రతిబింబిస్తుంది. లోతైన పరిశోధన సామర్థ్యాలు, పెట్టుబడిదారుడి గట్టి నమ్మకముల మద్దతు ఉన్న సాంకేతిక-ఆధారిత సౌకర్యాన్ని వ్యక్తిగతీకరించబడిన మార్గదర్శనముతో కలపడం ద్వారా, ఫండ్స్ ఇండియా ఒక సంపూర్ణ-సేవా వెల్త్ మేనేజ్మెంట్ ప్లాట్ఫార్మ్ గా, సమగ్రమైన వెల్త్ మేనేజ్మెంట్ పరిష్కారాలను కోరుకునే ప్రతి పెట్టుబడిదారుడికి ఒక గో-టు గమ్యస్థానముగా ఆవిర్భవించుటకు కట్టుబడి ఉంది. ఈ అభివృద్ధిపై వ్యాఖ్యానిస్తూ, అక్షయ్ సప్రు, గ్రూప్ సీఈఓ, ఫండ్స్ ఇండియా, ఇలా అన్నారు: "ఇది మాకెంతో గర్వకారణమైన మైలురాయి, ఇది భారతదేశాన్ని అందుబాటులో ఉన్న, వినూత్నమైన, పెట్టుబడిదారుడికి-ప్రాధాన్యత ఉన్న పరిష్కారాల ద్వారా సుసంపన్నం చేయాలనే మా ఉద్దేశాన్ని పునఃధృవీకరిస్తుంది. భారతదేశవ్యాప్తంగా ప్రపంచ-స్థాయి డిజిటల్ వెల్త్ మేనేజ్మెంట్ పరిష్కారాలను అందించడములో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మా వినియోగదారులు, పెట్టుబడిదారులు, భాగస్వాముల నమ్మకము మాకు ఎప్పుడు ప్రేరణను ఇస్తుంది. శక్తివంతమైన సంస్థాగత సహకారము, సాంకేతికతను మానవ టచ్ తో సమ్మిళితం చేయాలనే ఒక స్పష్టమైన విజన్ తో, మా డిజిటల్-ప్రాధాన్యత నమూనా పరిధిని మరింత పెంచటానికి, దేశవ్యాప్తంగా పెట్టుబడిదారులకు సాధికారతను అందించే ఏకీకృతమైన వెల్త్ వ్యూహాలను అందించుటకు మేము సిద్ధంగా ఉన్నాము." భవిష్యత్తులో ఫండ్స్ ఇండియా తన ఉనికిని భారతదేశవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యముతో ముందుకు సాగుతోంది, ఎన్ ఆర్ ఐ లకు కూడా సేవలు అందించుటకు అంతర్జాతీయంగా విస్తరించటానికి సిద్ధం అవుతోంది. భారతదేశ ఆర్థిక అభివృద్ధికి దోహద పడే వెల్త్ మేనేజ్మెంట్ ప్లాట్ఫార్మ్ కావాలనే ఉద్దేశముతో, డిజిటల్ గా, ఫిజికల్ గా, మ్యూచువల్ ఫండ్స్, ఆధునిక వెల్త్ పరిష్కారాలలో పెట్టుబడి పెట్టడాన్ని సులభతరం చేయుటను కంపెనీ లక్ష్యంగా చేసుకుంది. ప్రపంచములోనే అగ్రగామి అయిన పెట్టుబడి సంస్థ, వెస్ట్ బ్రిడ్జ్ క్యాపిటల్ మద్దతు పొందిన, ఫండ్స్ ఇండియా తన డిజిటల్-ప్రాధాన్యత నమూనాను అంచనావేయుటకు, ఏకీకృతమైన వెల్త్ మేనేజ్మెంట్ పరిష్కారాలను అందించుటకు శక్తివంతమైన సంస్థాగత సహకారాన్ని అందుకుంటుంది.

## 20 వేల మందికి భవిష్యత్-టెక్ శిక్షణనిచ్చేలా శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ విస్తరణ




**విజయవాడ మేజర్ న్యూస్ :** శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, తన ప్రధాన సీఎస్ఆర్ కార్యక్రమం 'శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్' విస్తరణను ప్రకటించింది. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా ప్రభుత్వ దృష్టికి మద్దతుగా, భారత యువతను భవిష్యత్‌కు సిద్ధమైన నైపుణ్యాలతో శక్తివంతం చేయాలనే తన నిబద్ధతను ఈ విస్తరణ మరల రుజువు చేస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమం 2024లో నాలుగు రాష్ట్రాల్లో ప్రారంభమై, ఈ సంవత్సరం 10 రాష్ట్రాలకు విస్తరించబడుతోంది. 2025 నాటికి 20 వేల మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా, కోడింగ్, ప్రోగ్రామింగ్ వంటి భవిష్యత్-టెక్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వబడుతుంది. ఇది గత సంవత్సరం 3,500 మంది విద్యార్థులకు ఇచ్చిన శిక్షణతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ. సాంకేతిక శిక్షణతో పాటు, విద్యార్థులు కార్యాలయ సంసిద్ధతను పెంపొందించడానికి అవసరమైన సాఫ్ట్ స్కిల్స్‌లో మార్గదర్శకత్వం పొందుతారు. అదనంగా, అర్హత కలిగిన అభ్యర్థులకు సంబంధిత పరిశ్రమల్లో ప్లేస్మెంట్ సహాయాన్ని కూడా అందించనున్నారు.

## షారుఖ్ ఖాన్, జగపతి బాబులతో థమ్స్ అప్ కొత్త ప్రచార కార్యక్రమం



**విజయవాడ మేజర్ న్యూస్ :** కోకా-కోలా ఇండియా ఐకానిక్ బిలియన్ డాలర్ల బ్రాండ్ థమ్స్ అప్, బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్, తెలుగు సినిమా లెజెండ్ జగపతి బాబు నటించిన "బిర్యానీ ఏక్ నహీ, దో హాత్ సే ఖాతే హై" అనే తాజా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం పరిపూర్ణ బిర్యానీ అనుభవానికి ఒక గుర్తు. దీనిని పరధ్యానం లేని లీనమయ్యే ఆచారంగా మారుస్తుంది. గత మూడేళ్లుగా, ఈ బ్రాండ్ థమ్స్ అప్ తో బిర్యానీని ఆస్వాదించే సూక్ష్మ నైపుణ్యాన్ని తీసుకొని దానిని ఒక ప్రసిద్ధ ఆచారంగా మార్చింది. బిర్యానీతో సహజంగా ఇష్టపడే పానీయంగా ప్రారంభమైనది. దీని బలమైన ఫిజ్, ఉరుములతో కూడిన రుచితో, థమ్స్ అప్ భారతదేశ వైవిధ్యమైన బిర్యానీ సంస్కృతిని ఒక భాగస్వామ్య సాంస్కృతిక క్షణంగా ఉన్నతీకరిస్తుంది.

## చెక్కు బౌన్స్ కేసులో మాజీ ఎంపీపీ భర్తకు ఏడాది జైలు

**గన్నవరం, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మాజీ ఎంపీపీ భర్త గాదె ప్రకాష్‌కు చెక్కు బౌన్స్ కేసులో గన్నవరం ప్రత్యేక మేజిస్ట్రేట్ ఐ.శైలజదేవి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే, గాదె ప్రకాష్ 2021 నవంబర్ 18న గన్నవరం ప్రాంతానికి చెందిన వల్లూరి తేజ వద్ద నుంచి రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చమని తేజ అడగగా అప్పులో కొంత భాగం రూ.9 లక్షల కు 2024 మే 27న చెక్కు ఇచ్చారు. కానీ ఆ చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా, ఖాతాలో నగదు లేకపోవడంతో తిరస్కరించబడింది. దీంతో బాధితుడు కోర్టులో కేసు వేశారు. కోర్టు వాదనలు విన్న అనంతరం నిందితుడిని దోషిగా తేల్చి మేజిస్ట్రేట్ ఐ.శైలజదేవి శిక్ష విధించారు. ఫిర్యాదుదారుడి తరఫున న్యాయవాది అనుమోలు వెంకటేశ్వరరావు వాదించారు.

## తాగునీటి కోసం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించిన గ్రామస్తులు



**పామర్రు మేజర్ న్యూస్ :** గత మూడు రోజులుగా తాగునీరు లేక అల్లాడుతున్నామంటూ ప్రజలు రోడ్డెక్కిన సంఘటన పామర్రు మండల పరిధిలోని కొమరవోలు గ్రామపంచాయతీ పరిధిలో గల గాంధీ ఆశ్రమం వద్ద చోటు చేసుకుంది. తమకు తాగునీరు రావడం లేదని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోని కారణంగా రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నపం చేసినా ఎవరూ తమ విన్నపాన్ని పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. మూడురోజులుగా తాగునీరు లేని కారణంగా తాము రోడ్డు మీదకు రావలసిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మంగళవారం గుడివాడ - పామర్రు జాతీయ రహదారిపై మండుటెండలో దాదాపు గంటపాటు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారి పైన వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ప్రజలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారనే సమాచారం అందుకున్నాక సంబంధిత అధికారులు తాపీగా వచ్చి నీటి సరఫరా చేస్తామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

## యూరియా లభ్యతపైన రైతులందరికీ అవగాహన కలిగించాలి

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో అవుట్ రీచ్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి ముమ్మరంగా తిరిగి యూరియా లభ్యత పైన రైతులందరికీ అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి యూరియా సరఫరా,లభ్యతపై రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సరఫరా, పంపిణీ పై రాష్ట్ర ముఖ్యమంత్రి చాలా తీవ్రంగా పరిగణిస్తూ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి యూరియా సరఫరా నిరంతరం జరుగుతుందని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని అవగాహన కలిగించే ఔట్రీచ్ కార్యక్రమం సజావుగా జరగాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు,మండల వ్యవసాయ అధికారులు నాయకత్వం వహించి ఈ ఔట్రీచ్ కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఏపీ ఏఐఎంఎస్ యాప్ లో లాగిన్ అయి ప్రతి గంటకు ఒకసారి నివేదిక పంపించాలన్నారు.ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో గత సంవత్సరం, ఈ సంవత్సరం మే నెల నుండి ఇప్పటివరకు యూరియా సరఫరా, పంపిణీ వివరాలను వెంటనే నిర్ణీత నమూనాలో అందజేయాలని, యూరియా కొనుగోలు చేసిన రైతుల వివరాలను అందజేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మచిలీపట్నం గుడివాడ ఉయ్యూరు ఆర్డిఓలు స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బి.ఎస్ హేల షారోన్, మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, డి సి ఓ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ ఏడీలు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవోలు,తహసీల్దారులు, పోలీస్ అధికారులు గ్రామ వ్యవసాయ సహాయకులు తదితర అధికారులు పాల్గొన్నారు

## దోమల నిర్మూలనకు మలాథిన్ పిచికారి..



**గన్నవరం, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** బుద్దవరం పంచాయతీలో దోమల నియంత్రణకు మలాథిన్ మందును పిచికారి చేసే కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ బడుగు బాలమ్మ, పాలకేంద్రం అధ్యక్షులుజి. నరేంద్ర ప్రారంభించారు. రమణమ్మ చెరువు, దళిత వాడ ఏరియాలో మురుగు కాలువలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన మొక్కల్లోనూ, ప్రభుత్వ హాస్టళ్లు, స్కూళ్లలోనూ దోమల నిర్మూలన కోసం మందును చెల్లించారు. ఈ సందర్భంగా బాలమ్మ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దావాజీ గూడెం, రాజీవ్ కాలనీ, పామర్తి నగర్ సెంటర్, బుద్దవరం ఏరియాలో పూర్తిగా దోమల మందు పిచికారి చేస్తామని చెప్పారు. మురుగు కాలవల్లో నీరు నిలబడకుండా డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దొరబాబు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక రహదారి పరిశీలించిన తహసీల్దార్



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో దళితుల స్మశాన వాటికకు రహదారి లేకపోవడంతో గ్రామస్తుల వినతి మేరకు తహసీల్దార్ బి.శ్రీను నాయక్ ఆ స్థలాన్ని పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా స్మశాన వాటిక కు వెళ్లేందుకు పొలాల మధ్యలో నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దళితులు తహసీల్దార్కు విన్నవించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కుమార్ రాజా దృష్టికి కూడా దళితులు సమస్యను తీసుకువెళ్లగా ఆయన పరిశీలించి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ కు విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసీల్దార్ శ్రీను నాయక్ స్మశాన వాటికకు వెళ్లే రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో చర్చించి భూసేకరణ ద్వారా రహ దారి ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తామని దళితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక విఆర్ఓ ఫణికుమార్, గ్రామ సర్వేయర్ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా సరఫరా నిమిత్తం రైతులు అనవసర ఆందోళన చెందవద్దు

**జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాలో యూరియా సరఫరా నిరంతరాయంగా, ఎటువంటి అంతరాయం లేకుండా జరుగుతోంది. ఇప్పటివరకు 3,180 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగింది. మంగళవారం 1,381 మెట్రిక్ టన్నులు జిల్లాకు వస్తున్నది. ఇంకా 1,200 మెట్రిక్ టన్నులు జిల్లాకు అలాట్మెంట్ చేయబడింది. అలాగే, వచ్చే పది రోజుల్లో మరో 8,000 మెట్రిక్ టన్నుల వరకు యూరియా సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.యూరియా సరఫరా గురించి రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదు.వారి అవసరాలకు తగినట్టు టోకెన్ విధానం ద్వారా సరఫరా కొనసాగుతోంది. అర్హత ప్రకారం ప్రతి రైతుకూ సరైన పరిమాణంలో యూరియా అందించేందుకు చర్యలు తీసుకోబడుతున్నాయని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు, తెలియజేశారు. అనధికారంగా యూరియాను నిలువ చేసినా, అక్రమ రవాణాకి పాల్పడినా, సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అవాస్తవ ప్రచారం చేసినా,వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.ప్రజలు ఇలాంటి సమాచారం వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలి.అన్ని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో టోకెన్ సిస్టం అమలు చేయబడింది. నిఘా పెంచబడింది. రైతుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం శ్రమిస్తుందికాబట్టి, కృష్ణాజిల్లా లోని రైతులు ఎటువంటి అపోహలకు, ఆందోళన లకు గురికావలసిన అవసరం లేదు. అధికారిక మార్గాల ద్వారా సరఫరా సక్రమంగా జరుగుతుందనీ జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తెలిపారు.

# జిల్లాలో యూరియా, ఎరువులకు కొరత లేదు







**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** జిల్లాలో యూరియా ఎరువులకు కొరత లేదని రైతులు అందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులు నానో యూరియా వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా మంగళవారం కంచికచర్లలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని, చందర్లపాడు మండలంలోని కొనయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతంగానికి అవసరమైన యూరియా ఎరువులను ప్రభుత్వం సిద్దంగా ఉంచడం జరిగిందని ఈ విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదాన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4,003 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. మరికొంత యూరియా ఈ రోజు అందుబాటులోకి రానున్నదన్నారు. వరి నాటు వేసినప్పుడు ఒకటో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చని.. నాటు వేసిన 30 రోజులకు రెండో విడతగా ఎకరానికి 30 కిలోలు, నాటు వేసిన 60 రోజులకు మూడో విడతగా ఎకరానికి 30 కిలోలు వేసేలా రైతులలో అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ భయాందోళనకు గురిచేసేలా సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవన్నారు. అన్నదాతలకు ప్రతిఒక్కరూ అండగా ఉండాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. అపోహలను నమ్మవద్దని ఏవైనా సందేహాలుంటే కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. అనంతరం నందిగామ మండలం ఆడవిరావులపాడు గ్రామంలో చౌక ధరల దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా తనిఖీ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 957 రేషన్ షాపుల ద్వారా 5 లక్షల 90,243 కార్డుదారులకు 8వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన 57,వేల 690 మంది కార్డుదారులను గుర్తించామని వారికి రేషన్ డీలర్లు ద్వారా ఇంటి వద్దనే నిత్యావసర సరుకులను అందజేసే ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి దానిపై క్యూ.ఆర్.కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా అన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె. బాలకృష్ణ, ఏడిఏ.శ్రీనివాస్, డిఏఎస్ వెంకటస్వామి, కంచికచర్ల, చందర్లపాడు తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రైతాంగ సమస్యలపై వైసీపీ నేతలు కదం తొక్కారు. మంగళవారం ఉదయం వైసీపీ నేతలు మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్ కు చేరుకుని అక్కడ నుండి కలెక్టరేట్కు ర్యాలీగా తరలి వెళ్లి మచిలీపట్నం ఆర్డిఓకి వినతి పత్రం అందించాలని నిర్ణయించారు.తీసుకున్న నిర్ణయం మేరకు ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు రైతులు మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్ కు చేరుకున్నారు.అక్కడ నుండి ముందుగా లక్ష్మీ టాకీస్ సెంటర్లో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు లేసి నివాళులర్పించి అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరారు.వందలాది మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు ర్యాలీలో పాల్గొనగా ముందు భాగాన మచిలీపట్నం వైసీపీ ఇన్చార్జ్ పేర్ని కిట్టు అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పెడన వైసిపి ఇన్చార్జ్ ఉప్పాల రాములతో పాటు వైసిపి నేతలు నిలిచి ర్యాలీని కొనసాగించారు. లక్ష్మీ టాకీస్ సెంటర్ నుండి ఆర్డిఓ కార్యాలయం వద్దకు ర్యాలీ వెళుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు.సుమారు పది నిమిషాలు పాటు పోలీసులు వైసీపీ నేతల మధ్య వాగ్వి వాదం చోటు చేసుకుంది. తర్వాత ముఖ్య నేతలను కలెక్టరేట్ లోనికి పోలీసులు అనుమతించారు మచిలీపట్నం ఆర్డిఓ కార్యాలయానికి నేతలు చేరుకొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డిఓ కే. స్వాతికి అందించారు.ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ శాంతియుతంగా రైతాంగ సమస్యలపై నిరసనకు పిలుపునివ్వగా ర్యాలీని అడ్డుకోవడం నిషేధాజ్ఞలు ప్రకటించడం మంచిది కాదన్నారు.రైతులు యూరియా అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని కానీ అధికారులు అధికార పార్టీ నేతలు యూరియా పుష్కలంగా అందించడం జరుగుతుందని ఎక్కడ ఎలాంటి యూరియా కొరత లేదని ప్రకటించడం బాధాకరమన్నారు.అన్ని ప్రాంతాలలో పిఎసిఎస్ ల వద్ద రైతులు యూరియా కొరకు పడిగాపులు పడుతున్నారని బారులు తీరి క్యూలో నిలిచి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయుకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా రైతు పోరుపై పిలుపునిచ్చిన వైసీపీ

## భారీగా తరలివచ్చిన రైతులు, వైసీపీ శ్రేణులు

## ఆర్డీఓకి వినతిపత్రం ఇచ్చిన వైసీపీ నేతలు





**పామర్రు మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా రైతు పోరు పై ఆందోళన చేపట్టాలని ఇచ్చిన పిలుపుమేరకు పామర్రు, పెనమలూరు నియోజకవర్గాలకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉయ్యూరు ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తరలిరాగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్, పెనమలూరు నియోజకవర్గం ఇంచార్జ్ దేవభక్తుని చక్రవర్తి తదితరులు ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి పాలనలో జరుగుతున్న అరాచకాలని, రైతులపై పక్షపాత వైఖరిని ఎండగడుతూ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపామన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి కూడా యూరియా సరఫరా చేయలేని దీనస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని,గత వైసిపి ప్రభుత్వం లో రైతుకు పుష్కలంగా యూరియా అందించామన్నారు. రాజశేఖర్ రెడ్డి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తే, జగన్మోహన్ రెడ్డి రైతుల పక్షపాతిగా నిలిచాడని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం దోచుకుందామా... దాచుకుందామా అనే రీతిలో ఉంది తప్పించి రైతుల ఇక్కట్లు పట్టడం లేదని విమర్శించారు. చంద్రబాబు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యుండి ఎవరైతే యూరియా గురించి అడుగుతున్నారో వారిని తొక్కేస్తాం, బొక్కలో వేసేస్తాను అంటున్నారని, ఇంకో మూడున్నర సంవత్సరాలు ఈ కూటమి పాలనను భరించాలా అని రైతులు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల అప్పుడు నోటికొచ్చిన వాగ్దానాలు చేసి ఈరోజు వాగ్దానాలు నెరవేర్చకుండా కపటనాటకాలు ఆడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ విజయం అంటూ అనంతపురంలో ఏ మొహం పెట్టుకొని సభ పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సూపర్ సిక్స్ కాదు కదా సింగల్ రన్ కూడా కొట్టలేదు అని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో కూటమి నేతలను ప్రజలు రోడ్లమీద తిరగనిచ్చే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

పామర్రు నియోజకవర్గంలో ఇష్టారీతిన శాసనసభ్యులు దోచేస్తున్నాడని విమర్శించారు. లంకపల్లి గ్రామంలో సొసైటీ భూములు రీ సర్వే పేరుతో టిడిపి నేతలు దోచుకుంటు న్నారని ఆరోపించారు. ఉచితంగా ఇసక ఇస్తానని హామీలు ఇచ్చి ఈరోజు శాసనసభ్యుని బంధువులు లారీ కి 15 వేల రూపాయలు వసూలు చేస్తున్నా రని, నియోజకవర్గంలో రేషన్ మాఫియాని శాసనసభ్యులు పెంచు పోషిస్తున్నా డని, కిలోకి నాలుగు రూపాయలు కమిషన్ తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నాడని ఆరోపణలు చేశారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే రైతులకు యూరియా సరఫరా చేయండి అంటూ కైలే అనిల్ సవాల్ చేశారు. దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కువగా ఉందన్నారు. రైతును దగా చేసిన వ్యక్తి చంద్రబాబు అని, ఎంత ఆయికట్టు ఉంది ఎంత యూరియా కావాలి అనే అంచనా లేకపోవడం వల్ల రైతు దయనీయమైన స్థితిలో ఉన్నాడన పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశాడని, రైతుల తరఫున ఉండే పార్టీ వైసీపీ పార్టీ అని పేర్కొంటూ రైతుల కోసం మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు.

## బాబు షూరిటీ మోసం గ్యారంటీలో మాజీ ఎమ్మెల్యే కైలే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం మర్రివాడ గ్రామంలో నిర్వహించిన "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమంలో పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి అనేక రకాల హామీలు ఇచ్చి తీరా గద్దెనెక్కాక ప్రజలను మోసం, దగా చేశారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం ద్వారా నాయకులు, కార్యకర్తలు క్యూ ఆర్ కోడ్ డౌన్లోడ్ చేసుకొని ప్రతి గ్రామంలోనూ ఇంటింటికి తీసుకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసం ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ క్యూ ఆర్ కోడ్ కు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు. అనంతరం మర్రివాడ గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కమిటీని ఆయన ప్రకటించారు. అధ్యక్షులుగా కొలుసు నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గా ఉబ్బ రాజేంద్రప్రసాద్, రాజులపాటి వెంకటేశ్వరావు, వంపుగడవల పండమ్మ, దారం జయంత్, కార్యదర్శుల గా గుండే వెంకటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, కట్టా ఆంజనేయులు, మాగంటి లక్ష్మి తిరుపతమ్మ లతో కూడిన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించిన ఎస్ఐ అర్జున్



పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 09, **మేజర్ న్యూస్ :** విజయవాడ సిపి రాజశేఖర్ బాబు ఆదేశాలతో,, ఏసీపీ ఎ బి జి తిలక్ పర్యవేక్షణలో, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం నుండి నిమజ్జన కార్యక్రమం వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఘనంగా నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. ఎస్సై అర్జున్ తమ సిబ్బందితో కలసి ప్రతిరోజు కమిటీ సభ్యులతో స్నేహపూర్వకంగా సమన్వయం చేస్తూ, ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పర్యవేక్షిం చారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చి, శ్రద్ధగా మార్గనిర్దేశం చేశా రు. శనివారం, చివరి రోజున, ఒకేరోజు పట్టణంలో సుమారు 50 వినాయక విగ్రహాలను నవరాత్రి ఉత్సవ సమాప్తి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు విగ్రహ నిమజ్జన కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. ఎస్సై అర్జున్, సిబ్బంది అన్ని ప్రదేశాల్లో పర్యవేక్షిస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా, పెనుగంచిప్రోలులోని వివిధ ప్రజా సంఘాల నాయకులు, వినాయక నవరాత్రి కమిటీ సభ్యులు ఎస్సై అర్జున్‌కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వినాయక చవితి ఉత్సవాలు సమాజంలో సంస్కృతిని మెచ్చుకుంటూ, సౌభాగ్యంతో, స్నేహ పూర్వకంగా జరగడం ఎంతో గర్వకారణం ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

# బూడిద టెండర్‌తో స్థానిక లారీలకు తీవ్ర నష్టం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ బూడిద రవాణా కోసం నూతనంగా ఏర్పాటు చేసిన టెండర్ ప్రక్రియ ద్వారా స్థానిక చిన్నాచితక లారీ ట్రాన్స్పోర్ట్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిపై జెన్కో యాజమాన్యం పునరాలోచన చేయాలని లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తూ గోడ పత్రికను ఆవిష్కరించారు ఇబ్రహీంపట్నంలోని లారీ ఓనర్స్ డ్రైవర్ అసోసియేషన్. ఇబ్రహీంపట్నం బూడిద చెరువు సమీపంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భవిష్యత్తు కార్యచరణ వివరిస్తూ పోరాట గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ ఏర్పాటు కొరకు భూములు త్యాగం చేసి, కాలుష్యాన్ని భరిస్తూ ఉన్న స్థానికులను వదిలేసి ప్రైవేటు వ్యక్తులకు బూడిద రవాణా టెండర్ కట్టబెట్టడం దారుణమని అన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా స్థానికంగా ఉన్న చిన్నాచితక లారీ, ట్రాన్స్పోర్ట్ నిర్వాహకులు తీవ్ర నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటివరకు మాఫియా చేతుల్లో ఉన్న బూడిద ఇప్పుడు టెండర్ విధానంతో మరింత జటిలం అయిందని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక లారీ ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.




## మహిళలకు, బాలికలకు అవసరమైన విషయాలపై అవగాహన

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 10 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అవగాహనా కార్యక్రమాల్లో మహిళలకు, బాలికలకు అవసరం అయిన విషయాలపై అవగాహన కల్గించడం జరుగుతుందని పెదపారుపూడి ఎంపీడీఓ జె.విమాదేవి, తహసీల్దార్ శ్రీను నాయక్ లు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళల రక్షణ కొరకు ఉన్న మండల స్థాయి అధికారుల కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీను నాయక్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశములు కల్పించి గౌరవించ వలసిన అవసరం ఉందని, మహిళలకు వారి హక్కుల పట్ల అవగాహన కల్పించడం, వారికి బాసట గా నిలవడం అత్యంత ఆవశ్యం అన్నారు. ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ లింగ సున్నితత్వం, లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్యం, పని ప్రదేశాలలో మహిళా రక్షణ చట్టాల పట్ల అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి ల ద్వారా మహిళా సాధికారిత సాధన, కౌమార బాలికల ఆరోగ్యం, పౌష్టిక ఆహారం, పోక్సో చట్టం వంటి విషయాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్, ఎంఈఓ బొడ్డు శ్రీనివాస్, ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు అరుణ కుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షెహనాజ్, సీనియర్ అసిస్టెంట్ షేక్ మెహరున్నిసా బేగం, వ్యవసాయ అధికారి త్రినాథ్ ఆంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.

## అమీనపురంలో పది టన్నుల యూరియా సరఫరా



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అమీనపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘములో మంగళవారం రైతులకు యూరియా సరఫరా చేశారు. మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగ సహకారంతో 10 టన్నుల యూరియా రైతులకు అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి మాట్లాడుతూరైతులు ఎవరూ యూరియా కోసం ఇబ్బంది పడవలసిన అవసరం లేదని, మండలంలోని అన్ని సొసైటీలకు యూరియా సరఫరా చేయడం జరిగిందని, అందరికీ అందుబాటులోనే యూరియా ఉందని తెలిపారు.

## 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ




**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెద్దమద్దాలి గ్రామంలో మంగళవారం ఎస్సీలకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.జెస్సీ శాంతకుమారి, బల్లిపర్రు గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ, నిమ్మకూరు పశువైద్యాధికారి డా. యం. మౌర్య సత్యేందర్, మండల పశువైద్యాధికారి డా. డి.సృజన్ కుమార్, సిబ్బంది పాల్గొని పాడి రైతులకు దాణాలు అందించారు. 24 మంది పాడి రైతులకు 1.2 టన్నుల పశువుల దాణా ను సబ్సిడీపై పంపిణీ చేశారు.

## గణేశ్ ప్రెస్ రాధాకృష్ణకు నివాళులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** గుండెపోటుతో మరణించిన చల్లపల్లి గణేశ్ ప్రెస్ అధినేత వక్కలగడ్డ రాధాకృష్ణకు మంగళవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఘనంగా వీడ్కోలు పలికారు. చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ప్రముకులు సజ్జా చలపతిరావు, విశ్రాంత అధికారులు దాసి సీతారామరాజు, ఉప్పాల సాంబశివరావు, అడపా గురవయ్య, అన్నపరెడ్డి శివరామప్రసాద్, నేతలు బుల్లా కిషోర్, దిరిశం వెంకట్రావ్, సీపీఎం నేత వాకా రామచంద్రరావు, నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు పెద్దఎత్తున పాల్గొని రాధాకృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.



### గర్భిణీలకు పౌష్టిక ఆహారం, అందజేత

జి.కొండూరు మేజర్ న్యూస్ : వెలగలేరు, జి.కొండూరు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల లో శ్రీ పుట్టపర్తి సత్య సాయి బాబా వారి శత జయంతి వేడు కలలో భాగంగా గర్భిణీలకు ఆశా కార్యకర్తలకు పౌష్టికాహారాన్ని,నారాయణ సేవలో భాగంగా వారికి భోజన ఏర్పాట్లు మంగళవారం నిర్వాహకులు చేశారు. ఆయా ఆసుపత్రికి చెందిన వైద్యు లు విజయ,నరేంద్రకుమార్, విశ్వ చైతన్య లు విజయవాడలోని సీతారామపురం శ్రీ సత్య సాయి బాబా వారి ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టిక ఆహారాన్ని పంపి ణీ చేశారు.. అలాగే వెలగలేరు జి కొండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు రక్షణలో భాగంగా వారికి నారాయణ సేవ భోజనాలను ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో గ్రామాల ఇన్చార్జ్ టీజీఆర్ గుప్తా,సేవాదళ్ ఇంచార్జ్ యన్.తులసి రామ్,సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ఏ.కొండూరు, మేజర్ న్యూస్ : మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగేలా జీఎస్టీ సడలింపులు చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ ఆయన చిత్రపటానికి ఏ.కొండూరు మండల బిజెపి శ్రేణులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా స్టేట్ జోనల్ ఇంచార్జ్ తేనేటి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రస్తుత జీఎస్టీ సడ లింపులు మధ్యతరగతి ప్రజలకు పెద్ద ఊరట అని, ఈ జీఎస్టీ సడలింపులను అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తున్నారన్నారు. మళ్లీ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి రావడం తథ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ఎస్సీ మోర్చా నాయకులు బాణావతు గాంధీ, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### కూటమిపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలి



ఏ.కొండూరు, మేజర్ న్యూస్ : కూటమి ప్రభు త్వంపై వైఎస్ఆర్ సి పి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని తెలుగుదే శం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మొహ మ్మద్ ఫైజాన్ హితవు పలికారు. ఏ కొండూరులో సోమవారం ఆయన మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్సిపి వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మహ బూబ్ షేక్ చేసిన వ్యాఖ్యాలను ఆయన తీవ్రంగా ఖండించారు.మెడికల్ కాలేజీలు తీసుకొచ్చింది మెడికల్ యూనివర్సిటీలు కట్టింది ఆ నాటి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పేరుతో ప్రజల సొమ్ము, ప్రభుత్వ సొమ్మును దోచుకున్న వాళ్ళు మాట్లాడేటప్పుడు తెలిసి తెలియని జ్ఞానంతో కాకుండా తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించిన వ్యక్తి నారా చంద్ర బాబు నాయుడు అని నిరుపేద ప్రజలకు ఒక్క పైసా ఖర్చు లేకుండా వైద్యం అందాలనే ఉద్దేశంతో 25 లక్షల ఆరోగ్య కార్డుని అందిస్తున్నారు అన్నారు. మీకు వైద్యం, ఆరోగ్యం ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రజ లకు పనికొచ్చే పనులు చేయాలన్నారు. మీ ప్రభుత్వంలో 108 వాహనాలని తుప్పు పట్టించి సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేనివ్యక్తులు ఈరోజు పెత్తం దారులకు చంద్రబాబునాయుడు కట్టబెడుతున్నారని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇంకొక మాట మాట్లాడటమే కానీ ఏ ఒక్కటైనా ప్రజలకు పని కొచ్చే పని చేశారా అని విమర్శించారు. దళితులు మాస్క్ అడుగుతేనే రోడ్డు మీద నిలబెట్టిన వ్యక్తులు వైద్యం గురించి ఆరోగ్యాల గురించి మాట్లాడటం చాలా దారుణంగా ఉందన్నారు. మాయ మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేయాలంటే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ప్రజల సొమ్మును ఎవరు దోచుకున్నారో ప్రజలకు బాగా తెలుసు అన్నారు. అసత్య ప్రచారాలు చేస్తే ప్రజలు నమ్మటానికి సిద్ధంగా లేరని హితవు పలికారు.

## జగ్గయ్యపేట రెవెన్యూ, స్థానిక శాఖల వారి లీలపై రాష్ట్ర విజిలెన్స్‌కి ఫిర్యాదు



**వాస్తవాలను వక్రీకరించి ఆ శాఖలో పనిచేస్తున్న సామంతులకు సహకారం**

**ఉపలోకాయుక్త ఆదేశాలను సైతం గాలికి వదిలేసిన స్థానిక అధికారులు**

**కోర్టులో వాదనలకు వత్తాసు పలుకుతున్న స్థానిక రెవెన్యూ,మున్నేరు అధికారులు**

**కోర్టులో యర్ర కాల్వ గట్టు స్థలాన్ని ప్రైవేటు స్థలంగా చూపించిన ప్రబుద్ధులు**

**తలనొప్పిగా మారిన యర్రకాల్వ తొలగించిన అక్రమ నిర్మాణ సమస్య**

**జిల్లా కలెక్టర్ ని సైతం లెక్కచేయని స్థానిక అధికార యంత్రాంగం**

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నదులు, చెరువులు, వాగులను కాపాడటమే కాకుండా వాటి పొరుదలకు ఉన్న కాలువల వెంబడి స్థలాలను సైతం ఆక్రమణలకు గురికాకుండ కాపాడుతుం ది. కాని జగ్గయ్యపేట పట్టణ ప్రాంతంలో గల రైతు బజార్ వెనుక పడమర వైపు భాగంలో గల చెరువు కు నీరు పారే యర్ర కాల్వ గట్టు హద్దులో గల స్థలం సర్వే నెంబర్ 304/2గా ఉంది.ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త, హైదరాబాద్‌లో కాలువ ఆక్రమణల పై జిల్లెల లక్ష్మీ ఫిర్యాదుతో జగ్గయ్యపేట మున్నేరు సబ్ డివిజన్,జగ్గయ్యపేట మండల తహసీల్దార్,జగ్గయ్యపేట మున్సిపాలిటీ,ఉమ్మడి కృష్ణ జిల్లా కలెక్టర్ మచిలీపట్నం శాఖల వారు పలుమార్లు ఆక్రమణ చేసినటువంటి వారికి నోటీసులు ఇచ్చి సర్వే చేసి యర్రకాల్వ అక్రమ రేకుల షెడ్ నిర్మాణాని అధికారులు పోలీసుల రక్షణతో తొలగించడం జరిగింది.యర్రకాల్వ సర్వే నెంబర్ : 304/2 కి ఆనుకొని పడమర భాగాన సర్వే నెంబర్ : 292/4 లో డోర్ నెంబర్: 4-67 గా మున్సిపాలిటీ అప్రూవల్ లే అవుట్ పొందిన 61 చదరపు గజాల స్థలంలో జిల్లెల లక్ష్మీ తాలూకా డాబ్బా ఇండ్లు ఉంది.ఆ ఇంటి ప్రహరీ అంచు హద్దు నుండి మాకు తూర్పు భాగం (అనగా యర్ర కాల్వ కి పడమర) యర్ర కాల్వ గట్టు సర్వే నెంబర్ 304/2 స్థలం 10 చదరపు గజాల లోకాయుక్త వారు ఆదే శానుసారంగా 2016 సంవత్సరంలో స్థానిక అధికారులు అక్రమ నిర్మాణాని తొలగించిన స్థలం ప్రస్తుతానికి యర్ర కాల్వ స్థలంగానే ఉంది.అక్రమ నిర్మా ణంలో తొలగించిన వ్యక్తి ప్రస్తుతం రెవెన్యూ శాఖలో పనిచేస్తూ రెవెన్యూ అధికారులను, ఏజీపిని ప్రభావితం చేసి,వారిని ప్రలోభ పెట్టి ప్రభుత్వ యర్రకాల్వ సర్వే నెంబర్ : 304 / 2 ని కాస్త జగ్గయ్యపేట కోర్టు వారికి వేరొక సర్వే నెంబర్ : 292/2 గా ఉన్న స్థలం 10 చదరపు గజాలను సైతం 2 సెంట్లుగా తప్పులుగా రికార్డులను చూపించి కోర్టు వారి వద్ద నుండి ఉత్త ర్వులను పొంది,అక్రమ నిర్మాణంగా తొలగించబడిన యర్ర కాల్వ స్థలాన్ని కాజేసే ప్రయత్నాలను అధికారికంగా చేస్తున్నారు.దీని పై వాస్తవాలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని జగ్గయ్యపేట రెవెన్యూ,మున్నేరు శాఖలలో గల రికార్డులను పరిశీలించాలని,దీనికి కారకులైన వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని యన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ వారిని,మున్నేరు డివిజన్ విజయవాడ వారిని,విజిలెన్స్ శాఖ రాష్ట్ర కమీషనర్ విజయవాడ వారిని, పోలీస్ కమీషనర్ విజయవాడ వారిని,జగ్గయ్యపేట స్థానిక అధికారులకు, ప్రభుత్వం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జిల్లెల లక్ష్మీ సంబంధిత ఆధారాలను కూడిన పత్రాలను జత పరచి వ్రాతపూర్వక వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది.యన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ స్పందించి యర్ర కాల్వ ఆక్రమణ పై ఎటువంటి అనుమతులు లేవని,అట్టి వారి పై చర్యలు తీసుకుంటామని ఆమెకి తెలియజేసినట్లుగా తెలియజేసింది. యన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమీషనర్ విజయవాడ వారు జగ్గయ్యపేట పట్టణ పోలీసులతో విచారించడం జరింగిందన్నారు.జగ్గయ్యపేట మున్సిపాలిటీ వారు అది యర్ర కాల్వ గట్టు ప్రభుత్వ స్థలంగా వారి రికార్డులను తనిఖీ చేసి సమాచారాన్ని ఇచ్చినట్లు ఆమె తెలియజేసారు.నెల పైబడి ఫిర్యాదు చేసిన జగ్గయ్యపేట మున్నేరు శాఖ నుండి ఎటువంటి చలనం లేకపోవడం బాధాకరం అని ఆమె అన్నారు.మా సిబ్బందేగా నీరు పారే యర్ర కాల్వ స్థలం అయితే ఏంటి,ఉపలోకాయుక్త తీర్పు ఇచ్చి తొలగిస్తేనేతే ఏమిటనే భావనతో జగ్గయ్యపేట మండల రెవెన్యూ వారు మాత్రం ఎప్పుడో యుద్ధప్రాతిపదికన తొలగించబడిన యర్రకాల్వ అక్రమ నిర్మాణ స్థలాన్ని 10 చదరపు గజాలుగా ఉన్న స్థలాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు కాస్త దానిని వేరొక సర్వే నెంబర్ : 292/2 గా చూపించి 2 సెంట్ల స్థలంగా వారు చూపిస్తూ,ఆ స్థలాన్ని పదే పదే సర్వే పేరుతో కొలతలు వేయాలని,దానిని కాస్త రెవెన్యూ రికార్డులలో తారుమారు చేసి వారి శాఖలో పనిచేస్తున్న సామంతులకు అప్పగించే ప్రయత్నాలు అధికారులు చేస్తున్నారు.ఇప్పటికైన తనలా ఎవ్వరు అధికారుల తీరు వల్ల ఇబ్బంది పడకూడదని,దీనికి సంబంధించిన జగ్గయ్యపేట రెవెన్యూ, మున్నేరు శాఖల కార్యాలయాలలో సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, వాస్తవాలను అధికారులు మార్పు చేసి తారుమారు చేయక ముందే విజిలెన్స్ లేక సిబిఐతో విచారణ చేపట్టాలని,లేకపోతే జగ్గయ్యపేట మండలం రెవెన్యూ శాఖలో భూ రికార్డులు మారి ప్రస్తుతం అనుభవిస్తున్న స్థల యజ మానులకు ప్రభుత్వం అన్యాయం చేసే పరిస్థితులు నెలకొన్నబో తుందని ఆమె జగ్గయ్యపేట అధికారుల తీరు పట్ల ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైన అధి కారుల తీరును విచారించి జిల్లెల లక్ష్మీకి న్యాయం చేయాలని ఆమె ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని, రాష్ట్ర ఉన్నతాధికారులను పత్రికా ముఖంగా ఆమె వేడుకున్నది.



### సహకార రంగాన్ని పునరుజ్జీవింపచేసిన కృష్ణారావు

అవనిగడ్డ మేజర్ న్యూస్ : సహకార శాఖ మంత్రిగా సహకార ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచి సహకార రంగాన్ని పునరుజ్జీవింపచేసిన మహనీ యుడు మండలి వెంకట కృష్ణారావు అని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వ రరావు అన్నారు. మంగళవారం స్థానిక వంతెన సెంటర్లో ని ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద శత జ యంతి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కృష్ణారావు విగ్రహానికి డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షు లు దాసినేని శ్రీనివాసరావు, రేపల్లె రవీంద్ర, చుండూరు నాగేశ్వరరావు, భోగా ది రాజ్ కుమార్, కూటమి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

### మోదుమూడి పంచాయతీకి మోదీ చిత్రపటం



అవనిగడ్డ మేజర్ న్యూస్ : ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ గ్రామపంచా యతీ కార్యాలయాలలోనూ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని తప్పనిసరిగా ఉంచాలి అని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మోదుమూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటం లేకపోవడాన్ని గమనించిన బిజెపి మండల కమిటీ అధ్యక్షులు బచ్చు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గ బిజెపి కో కన్వీనర్ తుంగల వెంకటగిరి, భోగాది చంద్రశేఖర్, భూపతి సుబ్రహ్మణ్యంలు నరేంద్ర మోడీ చిత్రపటాన్ని పంచాయతీ సిబ్బందికి అందజేస్తూ భారత ప్రధానిగా నరేంద్ర మోడీ అన్ని గ్రామాలలో అనేక కేంద్ర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రధానమంత్రి చిత్రపటం లేకపోవడం దారుణమని అన్ని పంచాయతీలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో నరేంద్ర మోడీ చిత్రపటం తప్పనిసరిగా ఆవిష్కరించాలని లేనిచో తీవ్రమైన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు గ్రామ కమిటీ బిజెపి మహిళలు పాల్గొన్నారు.

# యూరియా సరఫరా, పంపిణీపై రైతులకు అవగాహనకై మెగా అవుట్ రీచ్





**కృష్ణాజిల్లా మేజర్ న్యూస్ :** యూరియా సరఫరా, పంపిణీ పై రైతులకు అవగాహన కలిగించే ఉద్దేశంతో చేపట్టిన మెగా అవుట్ రీచ్ కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలో యూరియా కొరత ఉందని అపోహతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రైతులను చైతన్యపరిచే ఔట్రీచ్ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయ శాఖ అనుబంధ అధికారులు, క్షేత్రాధికారులకు దిశా నిర్దేశం చేసి యావత్ జిల్లా యంత్రాంగాన్ని సమాయత్త పరిచారు. ఈ మెగా ఔట్రీచ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వయంగా పాల్గొని ఇంటింటికి తిరిగి రైతుల అభిప్రాయాలను ఓపికగా తెలుసుకుంటూ రైతులందరికీ యూరియా సరఫరా చేస్తామని భరోసా కల్పించారు. జిల్లా యంత్రాంగం ముమ్మరంగా ఇంటింటికి తిరిగి యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని, రైతులందరికీ సరఫరా చేయడం జరుగుతుందని, ఎవరు కూడా ఎలాంటి ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నారు. ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ జిల్లాలోని రైతులకు కావలసినంత యూరియా తెప్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. జిల్లాలోని రైతులకు గత సంవత్సరంలో 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయగా ఈ సంవత్సరం అంతకుమించి యూరియా ఇప్పటికే సరఫరా చేయడం జరిగింది. జిల్లాకు ఇంకా 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా విడతల వారీగా జిల్లాకు యూరియా సరఫరా చేస్తుంది.

ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, డి సి ఓ చంద్రశేఖర్, మచిలీపట్నం గుడివాడ ఉయ్యూరు ఆర్డివోలు స్వాతి, బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారూన్, వ్యవసాయ శాఖ ఏడీలు, ఎంపీడీవోలు, తహసీల్దారులు, మండల వ్యవసాయ అధికారులు, పోలీస్ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొంటున్నారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ ఔట్రీస్ కార్యక్రమానికి రైతుల నుండి సానుకూల స్పందన లభిస్తూ సత్ఫలితాలను ఇస్తోంది. రైతుల్లో యూరియా దొరుకుతుందనే నమ్మకం పెంపొందుతోంది.

# ఎన్టీఆర్ జిల్లాలో సజావుగా ఎరువుల సరఫరా







**ఎక్కడా యూరియా కొరత లేదు**

**రైతులు అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి**

**నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలి**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఎరువుల పంపిణీ జరుగుతోందని.. ఎక్కడా యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ.. జి.కొండూరులో పర్యటించారు. మండలంలో ఎరువుల పంపిణీ స్థితిగతులను పరిశీలించారు. రైతులతో ముచ్చటించి, పంటల దశల వారీగా వినియోగించాల్సిన మోతాదుపై అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా నానో యూరియాను పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని.. రైతులు అవసరం మేరకు యూరియా, ఇతర ఎరువులను వినియోగించాలని, ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు. గత మూడు రోజులుగా ఎరువులపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని.. సమీప సొసైటీలో ఎరువుల నిల్వలు, వచ్చే వారం రోజుల్లో కొత్తగా వచ్చే ఎరువుల పరిమాణం, నానో యూరియా ప్రయోజనాలు, యూరియాను ఏ దఫా ఎంత వేయాలి.. తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 32 డ్రోన్ల ద్వారా నానో యూరియా స్ప్రేయింగ్ డెమో నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ఎరువుల రవాణా, సరఫరాపై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు ఎరువులను అందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో విస్తృతంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పర్యటన





**తిరువూరు, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్:** జిల్లాలో యూరియా, ఎరువులకు ఎక్కడా కొరత లేదని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో ముచ్చటించి ప్రస్తుతం వ్యవసాయ కార్యకలాపాలు, ఎరువుల పంపిణీ, ఎరువుల వినియోగంపై మాట్లాడారు. లక్ష్మీపురంలో డ్రోన్ సహాయంతో నానో యూరియాను స్ప్రే చేసే విధానం డెమోను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 4,003 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. మరికొంత యూరియా మార్గమధ్యంలో ఉందని వివరించారు. వరి నాటు వేసినప్పుడు ఒకటో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చని.. నాటు వేసిన 30 రోజులకు రెండో విడతగా ఎకరానికి 30 కిలోలు, నాటు వేసిన 60 రోజులకు మూడో విడతగా ఎకరానికి 30 కిలోలు వేయొచ్చన్నారు. రెండు, మూడో విడతల్లో అధిక దిగుబడులకు, పర్యావరణ పరిరక్షణకు, నేల సారాన్ని కాపాడుకునేందుకు యూరియాకు బదులు నానో యూరియాను స్ప్రే చేసుకోవచ్చని.. ఇందుకు అవసరమైన డ్రోన్లను సమకూర్చేందుకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ భయాందోళనకు గురిచేసేలా సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవన్నారు. అన్నదాతలకు ప్రతిఒక్కరూ అండగా ఉండాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. అపోహలను నమ్మవద్దని ఏవైనా సందేహాలుంటే కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. గత మూడు రోజులుగా దాదాపు 82 వేల మంది రైతులను కలిసి ఎరువులపై అవగాహన కల్పించడం జరిగిందని.. ఆన్‌లైన్ ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.



## ఆటిజం సమస్య ఎదుర్కొంటున్న బాలల కోసం 14న ఉచిత శిబిరం

**విజయవాడ, సెప్టెంబరు 09, మేజర్ న్యూస్ :** "ఆటిజం గర్భం నుంచే మొదలవుతుంది. పిల్లల జీవితంలోకి ప్రవేశించకముందే దాన్ని అడ్డుకోవాలి" అని రెస్ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి అన్నారు. భారతదేశంలో ఆటిస్టిక్ పిల్లల గట్-బ్రెయిన్ సమస్యలను పరిష్కరించేందుకు ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఎఫ్ఎంటి) థెరపీని అందిస్తున్న తొలి కేంద్రంగా రెస్ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ గుర్తింపు పొందింది. ఈ విప్లవాత్మక చికిత్సపై అవగాహన కల్పించేందుకు, ఆటిజం, గట్ సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు సహాయం చేసేందుకు, సెప్టెంబర్ 14న విజయవాడ సీతారాంపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి తెలిపారు గట్-బ్రెయిన్ అక్షంలో లోపాలు ఆటిజం లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయని, వాటిని అధిగమించడానికి ఎఫ్ఎంటి థెరపీ ప్రయోజనం చేకూరుస్తుందని. ఐసిఎంఆర్ ఆమోదించిన పరిశోధనలో ఈ చికిత్స మెరుగైన ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. "ఆటిజం-రహిత తరం కోసం టాక్సిన్-రహిత గర్భధారణ అవసరం" అని ఆయన పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ కోసం 91000 65552 నంబర్‌లో సంప్రదించాలని రెస్ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ విజ్ఞప్తి చేసింది.

## మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకుల పంపిణీ



**గన్నవరం, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** సూరంపల్లి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని షేక్ షర్మిలకు రూ.5,000, ప్రథమ సంవత్సరం విద్యార్థిని శిలారపు వైష్ణవికి రూ.2,000 ఆర్థిక సహాయాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం కార్యాలయంలో అందజేశారు. అలాగే, కృష్ణానగర్ (గన్నవరం) కు చెందిన నిరుపేద షేక్ బాషా భార్య షేక్ రిజ్వానా కుటుంబానికి రూ.3,000 విలువైన నిత్యావసర సరుకులను అందజేయడమైంది. అదనంగా, ఎల్ఐసి ఏజెంట్, మానవత సభ్యులు సత్య ప్రసాద్ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ గన్నవరం శాఖ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వి.వి. కృష్ణమోహన్, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, సభ్యులు షేక్ ఆదాం వలి, మానవత విద్యా డైరెక్టర్ సయ్యద్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు ప్రధాన సెంటర్లో వాహనాలు తనిఖీ



**కోడూరు మేజర్ న్యూస్ :** ద్విచక్ర వాహనాలకు ఏ విధమైన పత్రాలు లేకుండా బళ్ళు నడిపితే ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు. మైనర్లు ద్విచక్ర వాహనం నడిపిన, లైసెన్స్, ఇన్సూరెన్స్, సిబుక్, హెల్మెట్‌లే కుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కే.చాణిక్య, తెలిపారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999